సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి కె.చంద్రు

బిజెపి పాలనలో రోజూ రాజ్యాంగ హత్య

- మళ్లీ అధికారం కోసమే ఎస్ఐఆర్
- రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే ఆ శక్తులను గద్దె దింపాలి
- రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రు

ఎమర్జెన్సీ ప్రకటించిన రోజును రాజ్యాంగ హత్యా దినం అని బిజెపి అంటోందని, బిజెపి పాలనలో 365 రోజులూ రాజ్యాంగ హత్య జరుగుతోందని మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రు అన్నారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక, ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కర్నూలు లలితకళా సమితిలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ టి నరసింహా అధ్యక్షతన 'భారత రాజ్యాంగం సవాళ్లు - పౌరుల బాధ్యత"పై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జస్టిస్ చంద్రు ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు.

వార్త మెయిన్‌లో

దేవదాయ భూముల పరిరక్షణకు చర్యలు

-నాయి బ్రాహ్మణులకు రూ.25 వేలు -దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
-దేవాదాయ జోనల్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దేవాదాయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో కమిటీలు వేసి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. దేవాలయాల్లో పనిచేసే నాయి బ్రాహ్మణులకు రూ.25000 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం కర్నూలు నగర శివారులోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని జాతీయ రహదారి వద్ద రూ. 4.25 కోట్ల వ్యయంతో నిర్మించిన దేవాదాయ శాఖ కర్నూలు జోన్ పరిపాలనా కార్యాలయ భవన సముదాయాలను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పరిశ్రమల శాఖ మంత్రి భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎమ్మెల్యేలు గౌరుచరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి లు పాల్గొన్నారు. భవనాలను ప్రారంభించిన అనంతరం మంత్రి టిజి.భరత్‌తో కలిసి ఆనం రామనారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మించిన ఈ కార్యాలయం కర్నూలు నుండి కాణిపాకం వరకు ఈ కార్యాలయం పనిచేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీల్లోదేవాదాయ శాఖలో98 శాతం నెరవేర్చామన్నారు. ఆలయాల్లో ఉత్సవాలు, పూజా కైంకర్యాలు వైదిక నిర్ణయాల ప్రకారం చేస్తున్నామన్నారు. ఆలయాల్లో పురాతన కట్టడాలను పరిరక్షించే విధంగా శాఖ పనిచేస్తుందన్నారు. అర్చకులకు కనీస వేతనం రూ.15వేలు ఇస్తున్నామన్నారు. వేదవిద్య నేర్చుకున్న పండితులకు సంభావన కింద నెలకు రూ.3వేలు ఇస్తున్నాట్లు తెలిపారు. ఆలయాలలో ధూప దీప నైవేద్యాల కింద ప్రతి నెలా రూ. 10 వేలు ఇస్తున్నామన్నారు.. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ అసిస్టెంట్ కమిషనర్లు మాజీ జడ్‌పి చైర్మన్ వెంకటస్వామి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్‌కె శ్రీనివాసరావు ఆలయ ఇఒలు తదితరులు పాల్గొన్నారు

భవన సముదాయాలను ప్రారంభిస్తున్న మంత్రులు రామనారాయణరెడ్డి, టిజి.భరత్

నేడు 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ' స్పెషల్ డ్రైవ్

- 27 జెసిబిలతో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపు - శుభ్రతకు ఇచ్చిన గడువు ముగింపు
- యజమానులు జరిమానా చెల్లించాకే నిర్మాణ అనుమతులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా, ఆదివారం ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో పారిశుధ్య విభాగ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి నగర పరిధిలోని ఖాళీ స్థలాల్లో, రహదారుల ఇరువైపులా విస్తరించిన పిచ్చి మొక్కలను తొలగించడం జరుగుతుందని, ఆదివారం ఉదయం ప్రజాప్రతినిధులచే డ్రైవ్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఏకకాలంలో ఖాళీ స్థలాల శుభ్రతకు ఒకేసారి ప్రత్యేకంగా 27 జెసిబిలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. విస్తరిత ప్రాంతాల్లో ఖాళీ స్థలాల సమస్య అధికంగా ఉండటం వల్ల ఆ డివిజన్లకు అధిక సంఖ్యలో జెసిబిలను కేటాయించామన్నారు. ఇప్పటికే పారిశుధ్య సిబ్బంది అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. ఖాళీ స్థలాల యజమానులకు కొన్ని రోజులుగా పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో, నగరపాలక సంస్థ అధ్వర్యంలో పిచ్చి మొక్కల తొలగింపునకు ఈ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జన నివాసాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో పాములు, తేళ్ల నుంచి ప్రజలకు ముప్పు ఏర్పడటంతో పాటు, దోమలు, పందుల ఆవాసాల కారణంగా ప్రజారోగ్యానికి ముప్పు కలుగుతున్న అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖాళీ స్థలాల యజమానులకు విధించే జరిమానాను చెల్లించిన తర్వాతనే ఆయా స్థలాలకు విఎల్‌టి, భవన నిర్మాణ అనుమతులు, ఆస్తిపన్ను ప్రక్రియ చేపడతామని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాల సమస్యకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే స్థానిక శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్లను సంప్రదించాలని ప్రజలకు కమిషనర్ సూచించారు.సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగప్రసాద్‌బాబు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

వణికిస్తున్న చలి..!

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఈఏడాది ముందుగానే జిల్లా వాసులను చలి వణికిస్తోంది. డిసెంబర్ రెండో వారంలోనే శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం కూడా కాకముందే వాతావరణం చల్లగా మారిపోతోంది. ఉదయం 11 గంటైనా చలిగాలులు ఆగడం లేదు. రాత్రి గడిచే కొద్దీ మరింత చల్లగా మారి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ సమయంలో బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వెచ్చదనం కోసం తపిస్తున్నారు. మొన్నటి వరకు కార్తీకమాసం ప్రారంభమైనా ఇంకా చలి ప్రారంభం కాలేదని అందరూ అనుకున్నారు. ప్రస్తుతం చలితో పాటు శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం 6 నుంచి ఉదయం 9 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఆలూరులో అత్యల్ప ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోయాయి. గతేడాది కంటే 7 నుంచి 8 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వ్యవసాయ భూములుండే గ్రామీణ ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో చలి కారణంగా ప్రజలు జలుబు, దగ్గు, బారిన పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది శ్వాసనాళాలు మూసుకుపోయి ఉపరాడక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అదే సమయంలో ఒక రకమైన ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కూడా ఈ సీజన్‌లో వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శీతల గాలుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

రైతన్నకు నష్టాలు

వరి రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది ఎడతెరపీ లేని వర్షాలు కురవడంతో వరి పైరు పిలకలు లేకుండా ఏపుగా పెరిగింది. పిలకలు వేసి గంట కట్టక పోవడంతో పంట దిగుబడి తగ్గింది. ఒక పక్క పైరుపై తెగుళ్ల దాడి, మరోపక్క అకాల వర్షాలు, మొంథా తుఫాన్ ప్రభావంతో వరి కంకికి పాలు ఎక్కక గింజలో నాణ్యత తగ్గింది. పైరు నేలకు పడిపోయి ఎన్నులో సగం గింజ కాలేదు. దీంతో 30 బస్తాల నుంచి 35 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. వాగులు, వంకలు, కుందూనది పరివాహక ప్రాంతాల్లో పైరు నీట మునిగి పూర్తిగా దిగుబడి తగ్గిపోయి కౌలు రైతును మరింత నష్టాలను మూటగట్టుకున్నారు. నిమ్మ రైతుల పరిస్థితి కూడా దారుణంగా తయారైంది. నిమ్మకాయల ధర పాతాళానికి పడిపోయింది. మార్కెట్లో కేజీ నిమ్మకాయల ధర రూ.8 మాత్రమే పలుకుతుండడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కోత కూలీల ఖర్చులు, రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు నిమ్మకాయలను కోత కోయకుండానే తోటల్లో చెట్లపై అలాగే వదిలేస్తున్నారు.

ఉత్సాహంగా బాలోత్సవం

కర్నూలు బాలోత్సవం రెండు రోజుల పాటు ఉత్సాహంగా జరిగింది. తొలి రోజు ప్రారంభ సభ నిర్వహించారు. అనంతరం శాస్త్రీయ నృత్య పోటీలు, తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, కథా రచన, కవితా రచన, పద్యం భావం, వార్తా రచన, మ్యాప్ పాయింటింగ్, వినతిపత్రం రాయడం, స్పెల్-బీ, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలాపన, లఘు నాటికలు, విచిత్ర వేషధారణ నిర్వహించారు. రెండో రోజు చిత్రలేఖనం, కథ చెప్పడం, తెలుగులో మాట్లాడటం, కార్టూన్ వేయడం, రైమ్స్ చెప్పడం, జానపద నృత్యం బృంద పోటీలు, కోలాటం, సంగీత వాయిద్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. అనంతరం ముగింపు సభ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. పోటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. మొత్తం 2500 మందికిపైగా చిన్నారులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ...

అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

సిఐటియు మహాసభలు విజయవంతం చేయాలి

- రైతు సంఘం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

ప్రజాశక్తి-కర్నూల్ కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం సి. క్యాంపు రైతు బజారు, లలిత కళా సమితిలో జరిగిన సమావేశం సందర్భంగా రూ.18,700 విరాళాలు ఇచ్చినట్లు ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించే అఖిలభారత మహాసభలు విజయవంతం కోసం సంఘీభావంగా రైతు సంఘం నిధి సేకరణ చేయాలని పిలుపులో భాగంగా కర్నూలు నగరంలో సి క్యాంపు లలిత కళా సమితి ఆవరణంలో నిధి సేకరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర పధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కార్మిక కర్షక ఐక్యత కోసం పాటుపడుతున్న ఎపి రైతు సంఘం తన వంతు కర్తవ్యంగా రాష్ట్రవ్యాప్తంగా నిధి సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కర్నూలు నగరంలో రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిధి సేకరణ చేసినట్లు తెలిపారు. దేశంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు విధానాలు కార్మిక, రైతు వ్యతిరేక విధానాలుగా ఉంటున్నాయని, వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తారీఖు వరకు నిర్వహించే మహాసభలో కార్మికుల కర్షకుల సంబంధించిన అనేక తీర్మానాలు చేయబోతున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో తీర్మానాల అమలు కోసం రైతు సంఘం తన కర్తవ్యంగా పాల్గొంటుందని తెలిపారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం కార్మికులు రైతులు సంఘటితం కావాల్సినటువంటి అవసరం ఉందని పునరుద్ఘాటించారు. ఐదు రోజులపాటు జరిగే మహాసభలో దేశవ్యాప్తంగా కాకలు తీరిన కార్మిక నాయకులు హాజరయ్యే మహాసభను విజయవంతం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉందని తెలిపారు. కర్నూలు నగరంలోనీ సి క్యాంప్ రైతు బజారులో మహాసభ విజయవంతం కోసం ఇచ్చిన దాతలను లలిత కళా సమితిలో జరిగిన మీటింగ్ సందర్భంగా ఇచ్చిన దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు గొందిపర్ల మాజీ సర్పంచ్ జి. ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి ఎ. కృష్ణ ,సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి. అంజిబాబు ,షరీఫ్, మద్దిలేటి, గోపి ,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ,సురేష్, లవకుశ, రఫీ ,పందిపాడు శీను తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న రైతుసంఘం నాయకులు

సచివాలయం వద్ద పారిశుధ్య కార్మికుల నిరసన

7 నెలలుగా జీతంలేని బతుకులు

ఆకలి,అవమానాల మధ్య పారిశుధ్య కార్మికుల పోరాటం

ప్రజాశక్తి- వెల్దుర్తి

తెల్లవారక మునుపే చెత్తను ఊడ్చే చేతులకు, రోజూ మురికి మోసే భుజాలకు ఏడు నెలలుగా జీతం లేకపోవడం వెల్దుర్తి మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికుల జీవితాలను అస్తవ్యస్తం చేసింది. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, నిత్యావసరాలుఅన్నీ అప్పులపైనే నడుస్తున్నాయని కార్మికులు వాపోతున్నారు. జీతాల కోసం ఎన్నిసార్లు వేడుకున్నా ఫలితం లేకపోవడంతో, శుక్రవారం విద్యుత్తు సరఫరాను నిలిపివేయడం ద్వారా తమ నిరసనకు శ్రీకారం చుట్టారు. శనివారం నుంచి పారిశుధ్య పనులను బంద్ చేస్తూ, తమ కష్టాలకు ప్రభుత్వ పెద్దలు స్పందించాలనే ఆశతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆదివారం నుంచి నీటి సరఫరాను కూడా నిలిపివేస్తామని తెలిపారు.'పని మానేయాలనుకోలేదు కానీ మా పిల్లల ఆకలి మమ్మల్ని రోడ్డెక్కించింది" అని ఒక కార్మికుడు కన్నీళ్లతో చెప్పాడు. జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శిస్తూ గ్రామ సర్పంచి శైలజ పై సిఐ కార్యాలయం వద్ద ఫిర్యాదు చేశారు. పరిశుభ్రమైన గ్రామం కోసం నిత్యం తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టే కార్మికుల సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో 30 గొర్రెలు మృతి

ప్రజాశక్తి-కోడుమూరు/గూడూరు

కర్నూలు జిల్లా గూడూరు మండలం పెంచకలపాడు గ్రామం విశ్వ భారతి క్యాన్సర్ హాస్పిటల్ దగ్గర తెలంగాణ రాష్ట్రం కొల్లాపూర్ కు చెందిన 30 గొర్రెలు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని 30 గొర్రెలు మృతి చెందాయి. శనివారం రాత్రి లారీ అతీవేగంగా వచ్చిగొర్రెలను ఢీకొట్టింది. అక్కడికక్కడే 30 గోరెలు మృతిచెందగా మరికొన్ని గొర్రెలకు గాయాలైనట్లు గొర్రెల కాపరులు తెలిపారు. దీంతో గొర్రెల పెంపకం దారులకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రమాదంలో చనిపోయిన గొర్రెలకు ఒక్కొక్కటికి రూ.పదివేల నష్టపరిహారం చెల్లించి పెంపకం దారులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్ల వాహనాన్ని నియంత్రించలేక పోవడం వల్ల ప్రమాదం జరిగిందని గొర్రెల కాపరులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మతి చెందిన గొర్రెలకు నష్టపరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా నాయకులు డైరెక్టర్ రాముడు, హోసూరు వెంకటేష్ , జిఎంపిఎస్ జిల్లా నాయకులు వెంకట రాముడు, మల్లేష్ ఆంజనేయులు, మద్దిలేటి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గాయత్రీ గోశాల అభివృద్ధికి సహకారం

-దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగర శివారులోని గాయత్రీ గోశాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి చెప్పారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్‌తో కలిసి ఆయన గాయత్రీ గోశాలను సందర్శించారు. ముందుగా గోసహస్ర గోప్రదక్షిణ చేసి గోమాత ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు. మంత్రి టిజి. భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా వెయ్యికి పైగా గోవులున్న గోశాల లేదని చెప్పారు. గోశాల నిర్వహణకు ప్రభుత్వం తరుపున సహకారం అందించాలని దేవాదాయ శాఖ మంత్రిని కోరారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ వెయ్యికిపైగా గోవులున్న గోశాలను సందర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గోశాల నిర్వహణకు తన సొంత నిధులు వెచ్చిస్తున్న మంత్రి టిజి. భరత్‌ను ఆయన అభినందించారు. ప్రభుత్వం నుండి తప్పకుండా గోశాలకు సహకారం అందిస్తానని ఆయన చెప్పారు. అభివృద్ధిపై సీఎం చంద్రబాబు నాయుడును కలిసి చర్చిస్తానన్నారు. టిటిడి నుండి అవసరమైన సహకారం అందించేందుకు మాట్లాడతానన్నారు.

ఇక గాయత్రీ గోశాల పక్కనున్న స్థలం గోశాలకు కేటాయించే విషయంలో అధికారులతో మాట్లాడతానని చెప్పారు. దీంతో పాటు కర్నూలు నగరంలోని దేవాదాయశాఖ గోశాల పక్కనున్న స్థలం కూడా గాయత్రీ గోశాల నిర్వహణకు ఆర్థికంగా ఉపయోగపడేలా ఏ విధంగా చేయాలో ఆలోచన చేస్తామన్నారు. గాయత్రీ గోశాల అధ్యక్షుడు జగదీష్ గుప్త, సెక్రటరీ ఇల్లూరు లక్ష్మయ్య, ట్రెజరర్ ఇల్లూరు రాజ్యలక్ష్మి, విజయ కుమార్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సి బెళగల్ వేణుగోపాల్‌రాజు

నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-సి బెళగల్

నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని ఎస్ఐ వేణుగోపాల్ రాజు మండలంలోని ప్రజలకు సూచించారు. శనివారం ఆయా గ్రామాల్లో సందర్శించి ప్రజలు నేరప్రవృత్తికి ఎలా దూరంగా ఉండాలనే అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించుకొని ఉద్యోగాలను సాధించేలా శ్రద్ధచూపాలని అన్నారు. గ్రామాల్లో గొడవలకు దూరంగా ఉండాలని మనస్పర్థలు వచ్చినప్పుడు సమస్యలు ఎదురైనప్పుడు పోలీసులను ఆశ్రయించాలని పేర్కొన్నారు. అలా కాకుండా నేరాలకు పోయి కుటుంబాలలో ప్రశాంతత లేకుండా జీవితాలను నాశనం చేసుకోరాదని ప్రజలను కోరారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

కర్నూలు రేంజ్ డిఐజి, జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ : ప్రతి శని వారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్య క్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్‌లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్‌లోడ్‌తో వాహనాలు వెళ్లకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

మోషన్ జూనియర్ కాలేజీలో క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు బిర్లా కాంపౌండ్‌లోని రాజస్థాన్‌కోట ఆధ్వర్యంలో నడుస్తున్న మోషన్ జూనియర్ కళాశాలలో నేడు క్రిస్మస్ ఉత్సవాలు, క్యాండిల్ లైట్ ప్రార్థన ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ అంజాద్‌ఖాన్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా, డైరెక్టర్లు డాక్టర్ డి. వెంకటేశ్వర్లు, డాక్టర్ కిషన్, విజయ శేఖర్, అధ్యాపకులు, అధ్యపకేతర సిబ్బంది, బాలికలు పాల్గొని తమ పాటలు, పండుగ ప్రాధాన్యత తెలిపే రూపకాలతో అలరించారు. డాక్టర్‌సిన్హా క్రీస్తుసందేశాన్నిఅందించి విద్యార్థులను ఆశీర్వదించారు. అధ్యాపకులు, మేనేజింగ్ డైరెక్టర్లు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథి కెవి.నిర్మల ఆశీస్సులందించారు. క్యాండిల్‌లైటింగ్ సంగీతవిభావరితో ముగిసింది

మోషన్ జూనియర్ కళాశాలలో క్యాండిల్‌లైటింగులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి

జిల్లాలో 19,577 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

కర్నూలు జాతీయలోక్ అదాలత్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాలతో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో ఉమ్మడి కర్నూలు,నంద్యాల జిల్లాలలో 19,577 కేసులు పరిష్కారం అయ్యాయి. 197 మోటార్ ఆక్సిడెంట్ కేసులలో రూ.6,34,62,000 బాధితులకు నష్టపరిహారంగా ఇన్సూరెన్స్ కంపెనీల నుండి ఇప్పించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ మొత్తం రెండు జిల్లాల్లో 28 బెంచీలను ఏర్పాటు చేసి 284 సివిల్ కేసులు, 197 మోటార్ యాక్సిడెంట్ కేసులు, 19,096 క్రిమినల్ కేసులను పరిష్కరించామని తెలిపారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి కమలాదేవి, ఆరవ అదనపు జిల్లా జడ్జి వాసు, ఏడవ అదనపు జిల్లా జడ్జి లక్ష్మి రాజ్యం, కర్నూలు బార్ ప్రసిడెంట్ హరినాథ్ చౌదరి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జి లక్ష్మినరసింహారెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మల్లేశ్వరి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ , జూనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి అనూష, కోర్టుమా నిటరింగ్ సిఐ. రామానాయుడు, న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, బిఎస్ఎన్ఎల్ అధికారులు, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండలో 1090 కేసుల పరిష్కారం

-జస్టిస్ జ్యోష్నాదేవి

ప్రజాశక్తి- పత్తికొండ :

జాతీయ లోక్ అదాలత్ ద్వారా 1090 కేసులను పరిష్కరించి నట్లు జడ్జి జోష్నాదేవి తెలిపారు. శనివారం పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో మనీ-12, ఎపి-27, సిసి- 64, ఎన్ఐ యాక్ట్ -10, ఎక్సైజ్ -32, పిఎల్‌సి బ్యాంక్ -37, డివిసి-5, ఎంసీ-5, పెట్టి -887 మొత్తం 1090 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నామని తెలిపారు. లోక్ అదాలత్‌లో ఎన్నో ఏళ్లుగా పెండింగుల్లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. లోక్ అదాలత్ కక్షిదారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. న్యాయవాదులు, కోర్టు, లోక్ అదాలత్ సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు

- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండలం గంజిహళ్లి గ్రామంలో హంద్రీ నుంచి అక్రమంగా ఇసుక తరలిపోతోంది. పేదల ఇంటి నిర్మాణాలకు, ఇతర పనులకు అతి తక్కువ ధరకే అందాల్సిన ఇసుకను కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. తగిన చర్యలు చేపట్టాల్సిన మండల అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు పెదవి విరుస్తున్నారు. గ్రామంలోని హంద్రీ నుంచి శనివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తుల సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన కొంతమంది విలేకరుల బృందానికి హంద్రీలో పదుల సంఖ్యలో ఇసుకను నింపుకుంటున్న ట్రాక్టర్లు కంటపడ్డాయి. ఇంతలోనే పోలీసులు అక్కడికి చేరుకోవడంతో గమనించిన ట్రాక్టర్ల యజమానులు ఇసుకను అక్కడే అన్‌లోడ్ చేసి పరారైనట్లు సమాచారం. పేదల ఇళ్ల నిర్మాణాలతో పాటు ఇతర పనులకు ప్రభుత్వ అనుమతితోనే అతి తక్కువ ధరకే ఇసుకను అందజేయాలని ప్రభుత్వం, అధికారులు తెలుపుతున్నప్పటికీ నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇసుక అక్రమ తరలింపుపై పోలీసు సిబ్బందిని వివరణ కోరగా... పరారైన ట్రాక్టర్ల వివరాలు సేకరిస్తున్నామని, విచారించి తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

మున్సిపల్ మైదానంలో మట్టి నిల్వ

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థులు ఆడుకునే మైదానంలో అక్రమంగా మట్టి నిల్వలు చేసి ఆటంకం కలిగించడం సమంజసం కాదంటూ విద్యార్థి సంఘాల నాయకులు వాపోతున్నారు. మైదానంలో మట్టి పోసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సమంజసం కాదంటూ మండిపడుతున్నా రు. పాత బస్టాండు మైదానంలో సుమారు రూ.33 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు ఇటీవలే మొదలయ్యాయి. అక్కడ పేరుకుపోయిన మట్టిని తోడి లారీల ద్వారా మున్సిపల్ మైదానానికి తరలించి అక్కడ కాంట్రాక్టర్ నిల్వ చేస్తున్నారు. ఎక్కువ రోజులు మట్టి నిల్వ ఉండడంతో పాములు, విష పురుగులు సంచరిస్తున్నా యని విద్యార్థులు వాపోతున్నారు. మట్టికి అడ్డంగా తడకలు, కట్టలు ఉంచకపోవడంతో విద్యార్థులు మట్టిపై సైకిళ్లు ఎక్కిస్తూ కింద పడిపోతున్నారు. ఆటలాడే సమయంలో విద్యార్థులకు పాము, విషపురుగులు కాటు వేస్తే ఎవరు జవాబుదారీ అంటూ ప్రశ్నలు రేకెత్తిస్తున్నారు. మట్టిని అక్రమంగా నిల్వ ఉంచిన కాంట్రాక్టర్ నిర్వాహకంపై అధికా రులు నోరెత్తని పరిస్థితి ఉంది. ఆ మైదానంలో మున్సిపల్ హైస్కూల్, మున్సిపల్ నెహ్రూ, మెమోరియల్ హైస్కూల్‌కు సంబంధించిన సుమారు 4 వేల మంది విద్యార్థులు అక్కడ చదువుతున్నారు. విరామ సమయంలో ఆ మట్టిపై కొందరు విద్యార్థులు కాలకృత్యాలు, మూత్ర విసర్జనకు వెళ్తున్నారు. ఆదోని పట్టణంలో ఆటలు ఆడుకునేందుకు మైదానమే లేదు. ఉన్న ఈ ప్రాంతంలో క్రీడాకారులు ఆడుకునేందుకు అవకాశం లేకుండా చేయడం తో క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మైదానంలోనే ఉదయం చాలామంది వాకింగ్ చేస్తారు. మట్టి నిల్వ వల్ల అక్కడ సౌకర్యంగా లేదని కొందరు చెబుతున్నారు. పాఠశాలలకు సెలవు వచ్చిందంటే చాలు ఆ మైదానంలో చిన్నారులు క్రికెట్ ఆడడంతో కిక్కిరిసిపోతుంది. మైదానంలో మట్టి నిల్వ వల్ల చాలా ఇబ్బంది ఏర్పడిందని చెబుతున్నారు. అధికారులు స్పందించి మట్టి తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మైదానంలో వేసి మట్టి

ఆడుకునేందుకు ఇబ్బందిగా ఉంది

- వీరేష్, విద్యార్థి

మైదానంలో మట్టి నిల్వలు ఉండడం వల్ల క్రికెట్ ఆడుకునేందుకు ఆటంకంగా ఉంది. ఈ మైదానం తప్ప మరొకటి లేదు. నిల్వ ఉంచిన మట్టిలో గాజు పెంకులు, విష పురుగులు ఉన్నాయి. కొందరు పిల్లలు అటు వైపు వెళ్లి గాయాలు పాలయ్యారు. మట్టిని త్వరగా తరలించి విద్యార్థులు ఆడుకునేందుకు సౌకర్యంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

సహాయక చర్యలు చేపడతాం

- కృష్ణ, మున్సిపల్ కమిషనర్

పాత బస్టాండ్ మైదానంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ఇప్పుడే మొదలయ్యాయి. మట్టి వేసుకునేందుకు స్థలం కొరత వల్ల ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్‌కు మౌఖికంగా చెప్పారు. నిల్వ ఉంచిన మట్టిని త్వరగా మరో ప్రాంతానికి తరలించాలని కాంట్రాక్టర్‌ను సూచిస్తాం. ఉన్న మట్టి నుంచి విష పురుగులు సంచరించకుండా అడ్డంగా రేకులు లేదా తడకలు అమర్చాలని సూచిస్తాం. ఎవరికీ ఇబ్బంది కలగకుండా సహాయక చర్యలు చేపడతాం.

కొట్టుకుపోయిన కల్వర్టు

- నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్

ప్రజాశక్తి - కోసిగి

వర్షానికి కూలిన కల్వర్టు

మండలంలోని జంపాపురం గ్రామం నుంచి ఎస్.కొట్టాల గ్రామానికి వెళ్లే దారిలో మధ్యలో పెద్ద వంక ప్రవహిస్తోంది. ఈ వంకపై ఉన్న కల్వర్టు గత వర్షాకాలం భారీ వర్షాలకు కొట్టుకు పోయింది. రెండు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ రహదారి గుండా వేలాది ఎకరాల పంట భూమి ఉండడంతో రెండు గ్రామాల మధ్య ప్రజలు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్.కొట్టాల గ్రామం నుంచి జంపాపురం గ్రామంలో చాలామంది విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. విద్యార్థులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదని ఎస్.కొట్టాల గ్రామస్తులు దేవన్న ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టి రెండు గ్రామాల మధ్య రహదారి ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

లారీ ఢీకొని గోవు మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

పట్టణంలోని హెచ్‌పి గ్యాస్ సిలిండర్ లోడ్డు వద్ద వేగంగా లారీ ఢీకొట్టడంతో శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న గో సంరక్షణ శాలకు చెందిన గోవు మృతి చెందింది. శనివారం కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన కెఎ 36సి 1392 నెంబర్ గల హెచ్‌పి గ్యాస్ సిలిండర్ లారీ అనంతపురానికి వెళ్తుండగా కొండాపురం ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఉన్న గో సంరక్షణ శాల ఎదుట గోవును ఢీకొట్టింది. సుమారు 70 అడుగుల వరకు గోవును లాక్కెళ్లింది. గమనించిన గోవుల కాపరులు కేకలు వేయడంతో లారీని నిలిపివేశారు. గాయపడిన ఆవును గో సంరక్షణ శాల వైద్యులు చిన్న పరీక్షించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. డ్రైవర్ ఖలీల్ ద్వారా లారీని గో సంరక్షణ శాల సూపర్‌వైజర్ రాఘవేంద్ర దేశాయ్ గో సంరక్షణ శాలకు తరలించారు. గోవు మృతిపై శ్రీమఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాస రావు దృష్టికి తీసుకెళ్తామని సూపర్‌వైజర్ తెలిపారు.

మృతి చెందిన గోవు

డివిజన్ స్థాయిలో కౌతాళం విజేత

ప్రజాశక్తి - కౌతాళం

ఆదోని డివిజన్ స్థాయిలో త్రోబాల్ ఆటలో కౌతాళం మహిళా ఉపాధ్యాయుల జట్టు గెలుపొందని ఎంఇఒలు రామాంజనేయులు, శోభారాణి తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. ప్రవల్లిక కెప్టెన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాల ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచి విజయం సాధించినట్లు తెలిపారు. ప్రతి ఆటలో ఇలాగే రాణించి రాష్ట్రస్థాయికి వెళ్లి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గెలుపొందిన ఉపాధ్యాయులు

కిడ్నీ బాధితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి -దేవనకొండ

దేవనకొండ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటూ పారిశుధ్య కార్మికుడు రామాంజనేయులు కిడ్నీలు పాడయి అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యులు నారాయణరెడ్డి శనివారం దేవనకొండ గ్రామంలోని ఎస్సీ కాలనీకి చేరుకుని బాధితునికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న నారాయణరెడ్డి

వైసిపి పాలనలో ఒక్క రోడ్డు కూడా వేయలేదు

- టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి -ఆలూరు

వైసిపి పాలనలో రాష్ట్రంలో ఎక్కడా ఒక్క రోడ్డు కూడా వేయలేదని టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి విమర్శించారు. శనివారం ఆలూరు ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై ఎమ్మెల్యే విరుపాక్షి చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని తెలిపారు. గత వైసిపి పాలనలో రాష్ట్రంలో, ఆలూరు నియోజకవర్గంలో ఒక్క సిసి రోడ్డు, బిటి రోడ్డు గానీ వేయలేదని విమర్శించారు. ప్రజలకు కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేకపోయారని మండిపడ్డారు. పింఛన్ల విషయంలోనూ తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని, నిజమైన లబ్ధిదారులకు పింఛన్లు అందకపోవడంతో పాటు వృద్ధాప్య పింఛన్లను తొలగించారని తెలిపారు. సర్వశిక్ష అభియాన్ నిధుల కింద దాదాపు రూ.50 కోట్లు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించానని చెప్పారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక తనపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఆలూరు అభివృద్ధిపై ఎమ్మెల్యే విరుపాక్షి అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలని హితవు పలికారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ బిల్లేకల్ వెంకటేశ్వర్లు, రామదుర్గం తిమ్మయ్య, నగరడోణ కిష్టప్ప, సహకార బ్యాంక్ ఛైర్మన్ కురువ ఈరన్న, మండల కన్వీనర్ శీనప్ప, ఆస్పరి కృష్ణ యాదవ్, ఎంపిటిసి రమేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

- జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ సభ్యులు నారాయణరెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యులు నారాయణరెడ్డి, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య పేర్కొన్నారు. క్రిస్మస్ పండగ సందర్భంగా మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఎబిఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయని, క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. బహుమతి దాతలు మాజీ సర్పంచి బాట మీద రాజన్న, మాజీ ఉప సర్పంచి సత్యరాజు, టోర్నమెంట్ ఆర్గనైజర్లు వెంకప్ప, శ్రీనాథ్, రాజేష్, అనకర్, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

కొండెక్కిన కోడిగుడ్డు ధరలు

- సామాన్యులకు షాక్..!

ప్రజాశక్తి - కౌతాళం

సండే.. మండే... రోజు తినండి (కోడిగుడ్డు) అండే.. ప్రభుత్వ ప్రకటనలు టీవీల్లో వినడానికి బాగానే ఉన్నా.. సామాన్యులు కొనడానికి వెళ్తే కోడిగుడ్డు ధరలు షాక్ కొడుతున్నాయి. కోడి గుడ్డు ధరలు కొండెక్కి కూర్చోవడంతో ప్రజలు కొనలేక విలవిల్లాడుతున్నారు. చలికాలంలో చికెన్‌కు డిమాండ్ పెరగడంతో చికెన్ ధరలకు రెక్కలొచ్చి పైపైకి ఎగురుతుంటే.. కోడిగుడ్డు ధరలు కొండెక్కి కూర్చోవడంతో..! పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.

ఒక కోడి గుడ్డు ధర రూ.8, కిలో చికెన్ ధర రూ.260 నుంచి రూ.280 పలుకుతోంది. కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గడంతో ధరలు అమాంతంగా పెరిగాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురవడంతో గుడ్లు పెట్టే కోళ్లు అనారోగ్యంతో మృతి చెందగా ఉత్పత్తి బాగా తగ్గిందని వ్యాపారులు తెలుపుతున్నారు. అవసరాలకు తగ్గ కోడిగుడ్లు లేకపోవడంతో డిమాండ్ పెరిగిందని అంటున్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే పౌష్టికాహారం చికెన్, కోడిగుడ్ల ధరలు పెరగడంతో ఏం తినాలో.. ఏం కొనాలో అర్థం కాక దిక్కులు చూస్తున్నారు. ఇంటికి బంధువులు వస్తే, గ్రామాల్లో పండగలు వస్తే, స్నేహితులు కలిస్తే, పుట్టినరోజులకు, ఆదివారం, మంగళవారం అంటేనే ప్రజలు కొనుగోలు చేసేది చికెన్, మరి కొందరు కోడిగుడ్లు. ప్రస్తుతం ప్రజలు కొనడానికి వెళితే కళ్లు తిరుగుతున్నాయని, చుక్కలు కనిపిస్తున్నాయని కొనుగోలు దారుల నుంచి వస్తున్న మాటలు... ఈ ధరలు ఇలాగే కొనసాగితే పేదల పరిస్థితి ఏమిటని చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులు వీటి ధరలు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మహారాజశ్రీ IV అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు : కర్నూలు
I.A. No. 54/25 in O.S. No. 5/18
పి. సహదేవ రెడ్డి .... పిటిషనర్
V/s.
ఎం. క్రిష్ణరెడ్డి మరియు ఇతరులు .... రెస్పాండెంట్స్

నోటీసు రెస్పాండెంట్ నెంబరు 2

యు. కొండరెడ్డి,
S/o. యు. క్రిష్ణరెడ్డి,
క్రిష్ణకాంత్ ఆర్కెడ్,
గణేష్ నగర్ 2,
కర్నూలు జిల్లా.

పై పిటిషనరు రెస్పాండెంట్ నెంబరు 2 పై కోర్టులో పిటిషన్ I.A. No. 54/25 ను దాఖలు చేసినారు. కోర్టు వారు పై కేసును 30-12-2025 వ తేదీన వాయిదా వేసినారు. పై తేదీన ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా కాని లేక వకీలు ద్వార కాని హాజరై మీ సమాధానము తెలుపవలెను లేని యెడల మీకు వ్యతిరేకముగా తీర్పు చెప్పబడును.

కె. వసంత కుమార్
అడ్వకేట్, ఎమ్మిగనూరు.
సెల్ : 9885614589

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : ఎమ్మిగనూరు
O.S. No. 108/2022
షేక్ హాజరత్ బాష .... వాది
V/s.
షేక్ ముంతాజ్ బేగం మరియు ఇతరులు ... ప్రతివాదులు

సమన్లు

1) ఎస్. జమృత్ బేగం W/o. షేక్షావలి, చర్లపల్లి కాలని, గుత్తి టౌన్, అనంతపురం జిల్లా. (D2)
2) అన్సర్ బాష S/o. బాషుసాబ్, APHB కాలని, ఆదోని, కర్నూలు జిల్లా. (D3)
3) హసీన బేగం W/o. బి. అబ్దుల్, SR నగర్, హోస్‌పేట్, కర్ణాటక రాష్ట్రం (D9)
4) ఎన్. రెహన W/o. యాసిన్, కొత్తూరు కూడ్లిగి, బళ్ళారి జిల్లా (D12)
5) అన్వర్ అలి S/o. అబ్దుల్ సలాం, ఆదోని, కర్నూలు జిల్లా (D16)
6) రుక్సాన,D/o. అలియా ఆదోని,కర్నూలు జిల్లా (D22)

పై వాది ప్రతివాదులపైన D2,D3,D9,D12, D16,D22 లపై కోర్టులో బాగపరిష్కర దావాను దాఖలు చేసినారు కోర్టు వారు మీ హాజరుకై 17-12-2025వ తేదీన వాయిదా వేసినారు, మీరు ఈ తేదీన స్వయంగా కాని లేక వకీలు ద్వారా కాని ఉదయం 10-30 గంటలకు హాజరై మీ సమాధానం తెలుపవలెను. లేని యెడల కోర్టు వారు మీకు వ్యతిరేకములో తీర్పు చేప్పబడును.

కె. వసంత కుమార్
అడ్వకేట్, ఎమ్మిగనూరు.
సెల్ : 9885614589

ఆదోని జిల్లా కోసం పల్లెలంతా కదిలి రావాలి

- జిల్లా సాధన సమితి జెఎసి నాయకులు

ఆదోనిలో దీక్షలో పాల్గొన్న బుడగ జంగాలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా సాధనకు పశ్చిమ ప్రాంత పల్లెలంతా కదిలి రావాలని జిల్లా సాధన సమితి జెఎసి నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తి గౌడ్, టి.వీరేష్, నూర్ అహ్మద్, కోదండ, దస్తగిరి నాయుడు కోరారు. ఆదోని జిల్లా కోసం కోట్ల కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో బుడగ జంగాల సామాజిక వర్గం కొండపల్లి రమణ, కాశన్న, రంగన్న, బద్రి, టైలర్ అసోసియేషన్ అధ్యక్షులు షబ్బీర్, ప్రధాన కార్యదర్శి మహ్మద్, వేణు, గోపాల్, ఆయుబ్, ఖలీద్, సాధిక్ కూర్చున్నారు. ముందుగా బుడగ జంగాల నాయకులు జంగాల కాలనీ నుంచి బుర్రకథలు చెబుతూ ఆదోని విశిష్టత తెలుపుతూ ర్యాలీ చేపట్టారు. టైలర్ అసోసియేషన్ నాయకులు గీతా మార్కెట్ నుంచి భీమాస్ కూడలి వరకు ర్యాలీ చేపట్టి ఆందోళన చేశారు. దీక్ష శిబిరం వద్ద వారు మాట్లాడుతూ... అన్ని సామాజిక వర్గాలూ అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. సర్టిఫికెట్లు, పట్టాదారు పాసు పుస్తకం, భూ సమస్యలు, రెవెన్యూ సమస్యల కోసం 150 కిలోమీటర్లకు పైగా కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణ జరగాల్సిందేనన్నారు. ప్రభుత్వం స్పందించి పశ్చిమ ప్రాంతాల ఐదు నియోజకవర్గాలను కలిపి ఆదోని జిల్లాగా ప్రకటించి న్యాయం చేయాలని కోరారు. ఆదోనితోపాటు మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గంలో దీక్షలు, ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటించి మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మిగనూరులో చేపట్టిన దీక్షలు శనివారం నాలుగో రోజుకు చేరాయి. విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దీక్షలు నిర్వహించారు. దీక్షల్లో కూర్చున్న విద్యార్థి నాయకులు, జెఎసి నాయకులు గణేష్, బతుకన్న, శేఖర్, ఉదయ్, ఖాజా, కృష్ణ, అఫ్రిది, రఘు, సందీప్, అశోక్, నల్లారెడ్డికి సిపిఐ నాయకులు రంగన్న, సిపిఐ ఎంఎల్ నాయకులు సత్యన్న, డిటిఎఫ్ నాయకులు చంద్రశేఖర్, రఘులు పూలమాల, కండువా వేసి దీక్షలను ప్రారంభించారు. మద్దతుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఎమ్మిగనూరు డిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు. డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శిల్ప, కార్యదర్శి డాక్టర్ కార్తీక్, రాయలసీమ దశాబ్దకాల ఉద్యమ నాయకుడు నాగన్న మాట్లాడారు. పశ్చిమ ప్రాంతమైన ఆదోనిని జిల్లాగా ప్రకటించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. డాక్టర్ మాల కొండయ్య, డాక్టర్ రేఖ, డాక్టర్ ఈశ్వర్ రెడ్డి, డాక్టర్ మనోజ్, డాక్టర్ హేమంత్ కుమార్, డాక్టర్ ఫయాజుద్దీన్, డాక్టర్ శ్రీనివాస్, డిటిఎఫ్ నాయకులు గోరంట్ల, చంద్రశేఖర్, వెంకట రాముడు, ఈశ్వర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, నాగన్న, చిన్న, వీరేష్, రవీంద్ర, బాబు రాజ్, బుడగ జంగాల దస్తగిరి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో మద్దతు తెలుపుతున్న డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

మంత్రాలయం : ఆదోని జిల్లా ఏర్పాటుతోనే పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించాలని ఆదోని జిల్లా సాధన సమితి జెఎసి కన్వీనర్ రామతీర్థం అమరేష్ తెలిపారు. శనివారం ఆదోని జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో 2వ రోజూ చేపట్టిన దీక్షలో ఆయన మాట్లాడారు. ఆదోని జిల్లా ఏర్పాటుకు కూటమి నాయకులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు అనుకూలమా లేక వ్యతిరేకమా ప్రజలకు తెలపాలని అన్నారు. ఆదోని జిల్లా కావడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ దీక్షలో మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన గర్జి రాజేష్, కాలేబు, ఆనంద్, తోటయ్య, హనుమప్ప, లక్ష్మన్న, ముక్కరప్ప, జయరాజు, హుస్సేని మద్దతుగా కూర్చున్నారు. సంఘీభావంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫోరం నాయకులు వి.మాధవ్, ఎంఆర్‌పిఎస్ నాయకులు యోబు, భీమన్న, దళిత సీనియర్ నాయకులు సుందర్ రాజు, దేవదాసు, ప్రభుదాసు, రాజు, బహుజన సమైక్య సమితి జిల్లా కన్వీనర్ ప్రసన్నకుమార్, గుడికల్ గ్రామ దళిత సీనియర్ నాయకులు నాగరాజు, మాల మహానాడు జిల్లా కన్వీనర్ గోవిందు పాల్గొన్నారు.


మంత్రాలయంలో మాట్లాడుతున్న నాయకులు

హెల్మెట్‌తో ప్రాణాలు కాపాడుకోండి : ఎస్ఐ

ప్రజాశక్తి - చిప్పగిరి

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్ఐ సతీష్ కుమార్ ద్విచక్ర వాహనదారులకు సూచిం చారు. శనివారం చిప్పగిరి టు గుంతకల్లుకు వెళ్లే రహదారిలో వాహనాలను తనిఖీ చేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్, సీటు బెల్టు వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని తెలిపారు. మద్యం తాగి.. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ఓవర్ లోడు, ఓవర్ స్పీడు, ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా బైకులు, ఇతర వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని తెలిపారు. వేగం కన్నా గమ్యం ముఖ్యమని, ప్రాణాలు కాపాడుకోవడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ ఖాదర్‌వలీ, షబ్బీర్, శంకర్ పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తాం

- సర్పంచులు, ఎంపిటిసిలు

మాట్లాడుతున్న 16 గ్రామాల ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆదోని

పెద్ద హరివాణం మండలంలో తమ గ్రామాలను విలీనం చేసే ప్రక్రియను నిలిపి వేయాలని, లేకపోతే స్థానిక సంస్థల స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని సర్పంచులు, ఎంపిటిసిలు హెచ్చరించారు. శనివారం ఆదోనిలోని రెడ్డి భవన్ లో 16 గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి నరేంద్ర రెడ్డి, మదిరే సర్పంచి నారాయణ, ధనాపురం సర్పంచి చంద్రశేఖర్, టిడిపి నాయకులు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడారు. పెద్దహరివాణం మండలంలో మదిరే, కడితోట, జి.హోసళ్లి, గనేకల్లు, బసాపురం, నారాయణపురం, చాగి, ధనాపురం, సంతేకుడ్లూరు, చిన్నహరివాణం, నాగనాథనహళ్లి, తదితర 16 గ్రామాలు విలీనం జరిగితే రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తుందని తెలిపారు. అధికారులకు వినతి పత్రాలు ఇస్తూనే ఉన్నామన్నారు. తమ విన్నపాన్ని పట్టించుకోవడం లేదని తెలిపారు. తమ విన్నపాన్ని రాజకీయ పార్టీలు పట్టించుకోకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను నిలబడనివ్వబోమని హెచ్చరించారు. త్వరలోనే టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడుకు విన్నవిస్తామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి నిమ్మల రామానాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యను విన్నవించేందుకు అమరావతికి వెళ్తామన్నారు. నాయకులు కారుమంచప్ప, రాముడు, షేక్షావలీ, మదిరే వీరేష్, ధనాపురం ఈరన్న, రామకృష్ణారెడ్డి, రఘునాథ్ రెడ్డి, గోవిందు ఉన్నారు.

గాజులదిన్నెలో ముమ్మరంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- గోనెగండ్ల

మండలంలోని గాజులదిన్నె గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ శనివారం తెలిపారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి సహకారంతో సుమారు రూ.90 లక్షలతో గ్రామంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు, మరియు మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటిదాకా సుమారు 60 శాతం పనులు జరిగినట్లు చెప్పారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్ నాగన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు, డ్రైయినేజీ నిర్మాణ పనులు

బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - కౌతాళం

మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగి రెడ్డి సహకారంతో నదిచాగి గ్రామంలో బాధితులకు సర్పంచి కబ్బేర్ మహేష్ శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలో ఇటీవల చంద్ర మాస్టర్‌కు చెందిన హోటల్ అగ్ని ప్రమాదానికి గురయింది. అలాగే చలవాది బసవలింగ భవన నిర్మాణ పనిలో ప్రమాదానికి గురయి అనారోగ్యం పాలయ్యారు. ఆ రెండు కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలో ఎవరైనా కష్టాల్లో ఉంటే తన వంతు సహాయ, సహకారాలు అందజేస్తానని సర్పంచి మహేష్ పేర్కొన్నారు. మారెప్ప, మౌలా సాబ్, నజీర్ సాబ్, మల్లయ్య, హుస్సేని, దర్గప్ప పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ప్రకటన
మహారాజశ్రీ ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 224/2024
1. ధర్మవరం రామమ్మ
2. సావిత్రమ్మ
3. పద్మవతి. ...వాదులు
-V/s-
1.కొంక లక్ష్మిదేవి మరియు 7 మంది ఇతరులు. ...ప్రతివాదులు

To
1. కొంక అంజినయ్య, తండ్రి లేట్ కొంక రామాంజనయ్య (D2) నివాసము ఏరూరు గ్రామం, చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా
2. కొంక గోపాల్, తండ్రి లేట్ కొంక రామాంజనయ్య (D4) నివాసము పత్తికొండ గ్రామం, పత్తికొండ మండలం, కర్నూలు జిల్లా
3. మారుతుమ్మ, భర్త డి.రంగన్న, తండ్రి లేట్ కొంక రామాంజనయ్య (D6) నివాసము మద్దికెర గ్రామం, మద్దికేర మండలం, కర్నూలు జిల్లా
4. జయమ్మ, భర్త రామాంజులు, తండ్రి లేట్ కొంక రామాంజనయ్య (D8) నివాసము మోకాగ్రామం, మోకా మండలం, బళ్లారి జిల్లా

ప్రతివాదులకు (D2)(D4) (D6) (D8) దావా సమన్లు

పై నెంబరు గల దావాను వాది, ప్రతివాదుల పైన పై తెలిపిన కోర్టుయందు భాగపరిష్కారముల నిమిత్తము దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీ యొక్క హాజరు నిమిత్తము పై తెలిపిన కోర్టులో తేది: 23-12-2025 న ఉదయం 10:30 గంటలకు పైన తెలిపిన కోర్టులో మీరు స్వయంగానీ, వకీలు ద్వారా కానీ హాజరు అయ్యి, మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీకు పరోక్షముగా తీర్మాణించబడును.

కోర్టువారి ఉత్తర్వుల మేరకు ప్రకటన చేయడమైనది.
ఆలూరు
వాయిదా తేది: 23-12-2025

జె. చంద్రమోహన్ గౌడ్,
యం.నారాయణ స్వామి,
వాది అడ్వకేట్లు పత్తికొండ/ఆలూరు
సెల్.నెం.9885730411